రుణమాఫీ చేసే దాకా ఇక్కణ్నుంచి పోను

మొదటిపేజీ తరువాయి...

మండలం అంబర్‌పేటకు చెందిన రైతు తోట యాదగిరిగికి అదే గ్రామం సర్వే నెంబర్ 444/46లో వ్యవసాయ భూమి ఉంది. దీనిపై ఆయన క్రాఫ్‌లోన్ తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ రుణం రూ.2 లక్షల వరకు ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా అప్పటి టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రైతులు రుణాలు కట్టవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ చేస్తుందని హామీ ఇచ్చారు. ఆ హామీని నమ్మిన తోట యాదగిరి కాంగ్రెస్‌కు ఓటు వేసి ఆ పార్టీని గెలిపించారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా తోట యాదగిరి మాత్రం రుణమాఫీ కాలేదు. దీంతో స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌కు, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి, కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. మరోవైపు 14 నెలల కాలంలో అసలు, వడ్డీ కలిపి రూ.3 లక్షలకు పెరిగింది. దీంతో ఆందోళన చెందిన ఆయన శుక్రవారం గాంధీభవన్ మెట్లపై బైఠాయించారు. రూ.2 లక్షల రుణమాఫీతో పాటు తాను విక్రయించిన వడ్లకు బోనస్ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.



సీఎంకు రైతు యాదగిరి రాసిన లేఖ

రుణమాఫీ కాలే.. బోనస్ రాలే

రెండు లక్షల రూపాయల పంట రుణం మాఫీ చేస్తానని రేవంత్‌రెడ్డి చెప్పిండు. రుణమాఫీ చేస్తారనే ఆశతోనే రైతులందరం రేవంత్‌రెడ్డికి ఓట్లేసి గెలిపించనం. ఆయన అధికారంలోకి వచ్చిండు. కానీ, మా రుణం మాఫీ కాలేదు. రెండు లక్షలు మాఫీ చేస్తే మిగతా డబ్బులు మేం కట్టుకుంటాం. 55.85 క్వింటాల వడ్లు అమ్మిన. దానికి బోనస్ కూడా ఇంత వరకు రాలే. ఇటు రుణమాఫీ కాలే.. అటు బోనస్ రాలే. పింఛన్ కూడా రావట్లేదు. మా అబ్బాయికి కరోనా వస్తే రూ.25 లక్షలు ఖర్చు అయింది. ఇబ్బందులు ఉన్నాయి కాబట్టే లోన్ కట్టలేకపోయినం. ప్రభుత్వం తరపున నాకు స్పష్టమైన హామీ వచ్చే వరకు నేను కదలను. జైల్లో పోయేందుకు సిద్ధమే.

- తోట యాదగిరి, రైతు, తుంగతుర్తి

• యూరియా కోసం రైతుల బారులు

రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్, చిగురుమామిడి మండలాల్లో యూరియా కోసం బారులు తీరుతున్నారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం మల్లాపూర్‌లోని పీఏసీఎస్‌కు 350 బస్తాలు రాగా, ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున పంపిణీ చేయడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. యూరియా వచ్చిన గంటకే బస్తాలు దొరక్కపోవడంతో చాలా మంది రైతులు నిరాశతో వెనుదిరిగారు.

- తిమ్మాపూర్ రూరల్/చిగురుమామిడి

తోట యాదగిరికి జవాబివ్వు రేవంత్!

- గాంధీభవన్ సాక్షిగా ధర్మాగ్రహం
- తెలంగాణ అంతటా యాదన్నలే
- వారందరికీ బీఆర్‌ఎస్ పార్టీ అండ
- బీఆర్‌ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): గాంధీభవన్ సాక్షిగా ధర్మాగ్రహంతో తోట యాదగిరి సంధించిన ప్రశ్నలకు ముందు సమాధానాలు ఇవ్వు అని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చే ధైర్యం ఉన్నదా? అని అడిగారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్‌రెడ్డిని నిలదీసే యాదన్నలే ఉన్నారని, వారికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ఎన్నికల సమయంలో రైతాంగానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే దాకా అన్ని విధాలా అండగా ఉంటామని తేల్చిచెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఎక్స్ వేదికగా సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరానికి చెందిన రైతు తోట యాదగిరి గాంధీభవన్‌కు వచ్చి శుక్రవారం నిరసన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన రైతు రుణమాఫీ తనకు వర్తించలేదని, రైతు భరోసా సొమ్ము రాలేదని, సన్నవడ్లకు బోనస్ ఇవ్వలేదని గాంధీభవన్ సాక్షిగా తన రేవంత్ సర్కార్‌పై తోట యాదగిరి నిరసన వ్యక్తంచేశారు. తాను 55 క్వింటాళ్ల 80 కిలోల ధాన్యాన్ని అమ్మితే తనకు ఒక్క రూపాయి బోనస్ రాలేదని యాదగిరి పేర్కొన్న ఉదంతాన్ని హరీశ్‌రావు ఉదహరించారు. రైతుభరోసా, రుణమాఫీ, బోనస్ ఇస్తామని అనేక విషయాలు చెప్పి ఇప్పుడు మాట మారుస్తున్న వైనానికి యాదగిరి అనుభవమే సాక్ష్యమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఎన్నికల గారడీలేనని, 420 హామీల అమలు ఒట్టి బూటకమేనని తెలంగాణ ప్రజలు తక్కువ సమయంలోనే తెలుసున్నారని, యాదగిరి మాటలే అందుకు సాక్షీభూతమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఒక్కో రైతు కాంగ్రెస్ పార్టీని నిలదీసేందుకు ఒక్కొక్కరుగా గాంధీభవన్‌కు చేరకముందే కాంగ్రెస్ పాలకులు పాపపరిహారం చేసుకోవాలని హరీశ్‌రావు సూచించారు. రైతులకు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఉద్యోగులకు ఇలా అన్నివర్గాలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు గాంధీభవన్‌కు వచ్చిన రైతులు రేపో, మాపో రేవంత్‌రెడ్డి ఉండే జూబ్లీహిల్స్ ప్యాలెస్ దాకా వస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

ప్యాలెస్ పాలన వదలండి

సీఎం రేవంత్‌రెడ్డి ప్యాలెస్ పాలన వదిలి ప్రజాపాలన కొనసాగించాలని మాజీ హరీశ్‌రావు సూచించారు. ఏడు పదుల వయసులో రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరిగి, అధికారులను వేడుకున్నా ఫలితం లేని రైతులు గాంధీభవన్ వైపు అడుగులు వేస్తున్నారని ఉదహరించారు. ఇచ్చిన మాటను నిలుపుకోవాలని గుర్తుచేస్తూ తన ధర్మ నిరసనను తెలిపిన తోట యాదగిరిని హరీశ్ అభినందించారు. మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్‌పై పోరాడాలని, అందుకు యాదగిరిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది యాదన్నల కోసం బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలు చేసి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని భరోసా ఇచ్చారు.

1 నుంచి ఎండలే ఎండలు

- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో మార్చి 1 నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం 35.3 డిగ్రీల నుంచి 38.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేటలో అత్యధికంగా 38.2 డిగ్రీలు, జగిత్యాల జిల్లా బీర్‌పూర్‌లో 38.1, నిర్మల్ జిల్లా గింగాపూర్‌లో 38.1, నిజామాబాద్ జిల్లా మక్లూర్‌లో 38.1, మంచిర్యాల జిల్లా భీమారంలో 38, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దముద్నూర్‌లో 38 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వెటర్నరీ వర్సిటీ వీసీగా జ్ఞానప్రకాశ్

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ మంథని జ్ఞానప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీసీగా జ్ఞానప్రకాశ్ మూడేండ్ల పాటు కొనసాగుతారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తికి చెందిన జ్ఞానప్రకాశ్ యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్ విభాగంలో ప్రొఫెసర్, కంట్రోలర్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, రిజిస్ట్రార్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు.

భద్రతా ఏర్పాట్లపై దృష్టి పెట్టండి

- ఎమ్మెల్సీ ఎన్నికలపై కలెక్టర్లకు సీఈవో నిర్దేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎలక్షన్ కమిషన్ చర్యలు ముమ్మరం చేసింది. ఎన్నికల నిర్వహణ, భద్రత ఏర్పాట్లపై సీఈవో దృష్టి సారించారు. ఈ మేరకు శుక్రవారంపై జిల్లాల కలెక్టర్లతో సీఈవో సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లు, వెబ్‌కాస్టింగ్, మైక్రోఅబ్జర్వర్ల నియామకం తదితర అంశాలపై వివరించారు. మార్గదర్శకాలు విడుదల చేశారు. సమావేశంలో ఉమ్మడి మెదక్, నిజామాబాద్, అదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పరిధిలోని అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఎరువులు సరఫరా చేయండి

- కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతుల అవసరాల మేరకు ఎరువులు సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరినట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు లేఖ రాసినట్టు చెప్పారు. ఎరువుల సరఫరాపై శుక్రవారం సచివాలయంలో అధికారులతో సమీక్ష తర్వాత మంత్రి తుమ్మల మాట్లాడుతూ అక్టోబర్ నుంచి కేంద్రం నుంచి రావాల్సిన 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకు గాను కేవలం 6.73 లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా అయిందని వెల్లడించారు. కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా ఫిబ్రవరిలో 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా వచ్చిందని చెప్పారు. కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని సూచించారు. సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకుడు గోపి, అధికారులు పాల్గొన్నారు.

పసుపు రైతులకు బీజేపీ, కాంగ్రెస్ మోసం

- మద్దతు ధర ఇస్తామని కాంగ్రెస్ వంచించింది
- కుమ్మక్కైన మార్కెట్ కమిటీ అధికారులు, దళారులు
- ఎంఎస్పీ లేని బోర్డు బోడగుండుతో సమానం: వేముల ప్రశాంత్‌రెడ్డి

నిజామాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 21: పసుపు రైతులను కాంగ్రెస్, బీజేపీ దారుణంగా వంచించాయని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. 12 వేల మద్దతు ధర ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసగిస్తే, కనీస మద్దతు ధర ప్రకటించకుండా నామమాత్రపు పసుపుబోర్డు ఇచ్చి బీజేపీ మోసగించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, మార్కెట్ కమిటీ పాలకవర్గం, అధికారులు, దళారులు కుమ్మక్కై పసుపు రైతులను నిండా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వేముల శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కుటుంబం మొత్తం తొమ్మిది నెలలు కష్టపడితే వచ్చే పసుపు ఒకప్పుడు రైతును ఆదుకునేదని, అందుకే రైతులు పసుపును తల్లి పంటగా భావిస్తారని చెప్పారు. ఎన్నికల ముందర రైతులపై హామీలు గుప్పించిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు వంచించాయని, అందరూ కుమ్మక్కవడంతో రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. ఫలితంగా నిజామాబాద్ గంజ్‌లో రెండు, మూడ్రోజులు నిలబడి తుట్టికి పావుసేరుకు అమ్ముకుంటున్నారని తెలిపారు. సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ.13 వేలు పలికిన ధర ఇప్పుడు రూ.10 వేలకు పడిపోయిందన్నారు. దళారులు రూ.8 వేలకు మాత్రమే కొని అన్నదాతలను ముంచుతున్నారని మండిపడ్డారు. పాలకవర్గం దళారులతో కుమ్మకై రైతులను మోసం చేస్తే బీఆర్‌ఎస్ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ డిక్లరేషన్‌లో పసుపు క్వింటాలుకు రూ. 12 వేలు చేస్తామని హామీ ఇచ్చిందని, మరీ ఇప్పుడు ఎందుకు అమలు చేయడం లేదని వేముల ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ నామమాత్రపు బోర్డు తెచ్చాడని, దానివల్ల లాభమేమున్నదని ప్రశ్నించారు. పసుపుబోర్డు లేనప్పుడు రూ.18 వేలు ధర పలికింది. బోర్డు వచ్చిన తర్వాత రూ10వేలకు తగ్గింది. రైతులకు ఉపయోగపడని పసుపుబోర్డు బోడిగుండు సున్నాతో సమానమని ఎద్దేవా చేశారు. సాంగ్లిలో రూ.13,800 ధర ఎలా వస్తుంది, నిజామాబాద్‌లో ఎందుకు రావటం లేదని ప్రశ్నించారు. సాంగ్లి, నిజామాబాద్ మార్కెట్‌ను అనుసంధానం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.12 వేలు ఇస్తామన్న హామీ నెరవేర్చాలని, ఎంపీ అర్వింద్, పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ప్రధానిని కలిసి రూ.15 వేల మద్దతు ధర ఇచ్చే బోర్డు కావాలని డిమాండ్ చేయాలని సూచించారు. కేసీఆర్ హయాంలో ఎల్‌ఆర్‌ఎస్ తీసుకొస్తే గగ్గోలు పెట్టిన రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క ..ఇప్పుడు ఎందుకు ఎల్‌ఆర్‌ఎస్ కట్టాలని అంటున్నారని నిలదీశారు. ప్రజలెవరూ ఎల్‌ఆర్‌ఎస్ కట్టనవసరం లేదని చెప్పారు.

సబ్‌ప్లాన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు నిధులు: భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూల్స్, గురుకులాలకు సంబంధించి అద్దెలు, డైట్ చార్జీలు ఎప్పటికప్పుడు చెల్లించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ శాఖల బడ్జెట్ సన్నాహక సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం వివిధ శాఖ నుంచి ఎస్సీ, ఎస్టీ శాఖలకు రావాల్సిన నిధులపై కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి నిధులు రాబట్టడంలో వేగం పెంచాలని ఆదేశించారు. గిరిజనుల భూముల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సంయుక్తంగా సమావేశాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఎస్టీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ హరిత, ఇరిగేషన్ సెక్రటరీ పాటిల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఊర్లల్లోనే పోటీ

- అభివృద్ధిపై చర్చకు బీఆర్‌ఎస్, బీజేపీ సిద్ధమా?
- నారాయణపేట బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పనుల ప్రారంభం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రేపు జరిగే పంచాయతీ ఎన్నికల్లో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఊర్లలోనే మేము ఓట్లడుగుతాం.. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వని ఊర్లలో బీఆర్‌ఎస్ పోటీ చేయకుండా ఉంటదా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నారాయణపేట జిల్లా అప్పక్‌పల్లి గ్రామంలో శుక్రవారం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ పది నెలల కాలంలో తాము చేసింది.. పదేండ్లలో మీరు చేసింది ప్రజలకు అర్థమైతదని తెలిపారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ చేయడం తాము సాధించిన విజయాలుగా చెప్పారు. 12 ఏండ్లు ప్రధానిగా మోదీ పాలన, పదేండ్లు ముఖ్యమంత్రిగా కేసీఆర్ పాలన, 13 నెలల్లో తమ ఇందిరమ్మ పాలనపై చర్చకు తాము సిద్ధమని తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి కేసీఆర్, బీజేపీ నుంచి కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రావాలని, అంబేద్కర్ సాక్షిగా చర్చిద్దామని సవాల్ విసిరారు. పారా మెడికల్ ఉద్యోగాలకు యూరప్ మిడిల్ ఈస్ట్ దేశాల్లో మంచి డిమాండ్ ఉన్నదని చెప్పారు. ఇక్కడ చదివిన విద్యార్థులకు అక్కడ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తున్నదని వివరించారు. దీనిపై అప్పక్‌పల్లిలో నర్సింగ్ కళాశాల విద్యార్థులు అవాక్కయ్యారు. ఇక్కడ ఉద్యోగాలు ఇస్తామని చెప్పకుండా, ఎక్కడో కల్పిస్తామనడంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్ ప్రారంభించిన అన్ని పనులు కూడా గతంలో బీఆర్‌ఎస్ హయాంలో శంకుస్థాపనలు చేసి పూర్తిచేసినవే కావడం గమనార్హం. మెడికల్ కాలేజీని కేటాయించి, విద్య పరిశోధన కోసం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం, వసతి గృహాల కోసం కేసీఆర్ సర్కారు రూ.130 కోట్లను కేటాయించింది. మంత్రి హోదాలో కేటీఆర్ నాడు శంకుస్థాపన కూడా చేశారు. పూర్తయిన దానిని సీఎం ప్రారంభించడం కొసమెరుపు. నర్సింగ్ కళాశాలకూ గతంలో బీఆర్‌ఎస్ శంకుస్థాపన చేసింది. వాటినే సీఎం ప్రారంభించారు. అదేవిధంగా నారాయణపేట జిల్లాలో మండల కార్యాలయాలు పోలీస్ స్టేషన్లలో భవన నిర్మాణాలకు గతంలోని నిధులు విడుదలై పూర్తయ్యాయి. వాటిని ఇప్పుడు సీఎం ప్రారంభించారు.

కొడంగల్ ఠాణాలో అరెస్టైన దుద్యాల మండల రైతులు

సీఎం రాకతో మహిళల అవస్థలు

కొడంగల్, ఫిబ్రవరి 21: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం పోలేపల్లిలోని పోలేపల్లి ఎల్లమ్మ జాతరకు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చిన సమయంలో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆయన ఆలయానికి వస్తున్నారని పోలీసులు ఎవ్వరినీ లోనికి అనుమతించలేదు. భక్తుల క్యూలైన్లను ఎక్కడికక్కడే ఆపివేశారు. అదే సమంలో అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించేందుకు బోనాలు ఎత్తుకొని ఆలయానికి వచ్చిన మహిళలు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అరగంటకు పైగా ఆలయం ఎదుటే ఎండలో నిరీక్షించాల్సి వచ్చింది. సీఎం వచ్చి అమ్మవారిని దర్శించుకొని వెళ్లే వరకు భక్తులను గుడి బయటే ఉంచడంతో తీవ్ర అసహనానికి గురయ్యారు. బోనం కుండలతో వచ్చిన వారిని మిట్ట మధ్యాహ్నం ఎండలో ఉంచడమేమిటని మండిపడ్డారు. సీఎం వెళ్లిన తర్వాత ఒక్కసారిగా జనాలు అమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లడంతో తోపులాడుతున్నారు. ఇదిలా ఉండగా సీఎం రేవంత్‌రెడ్డి పోలేపల్లి ఎల్లమ్మ ఆలయానికి వచ్చే క్రమంలో పలువురు రైతులను ముందస్తుగా అరెస్టు చేసి ఠాణాల్లో ఉంచారు. సీఎం నియోజకవర్గానికి వచ్చే ప్రతిసారీ ఈ బాధలు తప్పడం లేదని, ఇంకెన్నాళ్లీ తిప్పలని రైతులు వాపోతున్నారు.

పాలమూరును ఎడారి చేసింది మీరే!

- పోతిరెడ్డిపాడుకు హారతులిచ్చిన చరిత్ర కాంగ్రెస్‌దే
- సీఎంపై హరీశ్‌రావు మండిపాటు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): 'పాలమూరులోనే కాదు రాష్ట్రంలో ఏ ఒక్క ఎకరానికీ నీళ్లు ఇవ్వని అర్భకుడివి నువ్వు. కేసీఆర్ మీద రంకెలేస్తావా?' అని సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉత్తవాగుడే తప్ప ఒక్క వాగు మీదైనా ఇటుక కూడా పెట్టని ముఖ్యమంత్రివి అంటూ ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి పనికిమాలిన పద్నాలుగు నెలలపాలనపై తాను చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. 'రేవంత్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నా. చర్చ ఎక్కడ..? ఏ రోజు చేద్దామో చెప్పాలి' అని అన్నారు. తాను రేవంత్‌రెడ్డి చెప్పిన చోటికే వస్తానని, అది కొడంగల్ నియోజకవర్గమైనా సరే.. రేవంత్ ఇంట్లో అయినా సరేనని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో పాటు, రుణమాఫీ, రైతుబంధు, మహాలక్ష్మి, పెన్షన్లు, నిరుద్యోగభృతి, ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏలు ఇలా సకల అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని చెప్పారు. రేవంత్‌రెడ్డి కుసంస్కారి కనుకనే కేసీఆర్‌పై కల్మషపూరిత ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ కృష్ణా జలాల దోపిడీని నిలువరించలేకపోతున్న రేవంత్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. అరుపులు, పెడబొబ్బలతో రాష్ట్ర సాగు, తాగు నీళ్ల కష్టాలు తీర్చలేవనే సంగతిని రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలని చెప్పారు. నిందలు వేయడం మాని నదీజలాల్లో రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలని హితవు పలికారు.

పాలమూరును ఎడారిగా మార్చింది టీడీపీ, కాంగ్రెస్సే

రేవంత్‌రెడ్డి తనకు అలవాటైన పైశాచిక భాషలో పాలమూరు ప్రగతిపై పచ్చి అబద్ధాలు చెప్పారని హరీశ్‌రావు ఆరోపించారు. కృష్ణా జలాలను ఏపీ యథేచ్ఛగా తరలించుకుపోతుంటే ఆపడం చేతగాని రేవంత్ తమపై రంకెలేస్తున్నారని విమర్శించారు. పాలమూరును ఎడారిగా మార్చిన పాపం టీడీపీ, కాంగ్రెస్‌లదేనని దుయ్యబట్టారు. సొంతజిల్లాకు తీరని ద్రోహం చేసింది రేవంత్‌రెడ్డేనని, ఆయనది తల్లిపాలు తాగి రొమ్ముగుద్దే చరిత్ర అని ధ్వజమెత్తారు. పాలమూరు ప్రాజెక్టులను పెండింగ్ పెట్టి, అక్కడి ప్రజల బతుకుల్లో నిప్పులు పోసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రెండు పార్టీల్లో ఉన్న రేవంత్‌రెడ్డికి ఆ పాపాల్లో వాటా ఉందని అన్నారు. పోతిరెడ్డిపాడును పెంచుతామని అన్నందుకే తాము నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చామని చెప్పారు.

పోతిరెడ్డిపాడుకు హారతులిచ్చిన కాంగ్రెస్

రేవంత్‌రెడ్డి వక్రీకరించినంత మాత్రాన చరిత్ర మారుతుందా? సీఎం వక్రబుద్ధి ప్రజలకు తెలియకుండా పోతుందా? అని హరీశ్‌రావు విమర్శించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో వారికి ఊడిగం చేసింది, పోతిరెడ్డిపాడు నీళ్లు తరలిస్తుంటే హారతులు ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ నేతలదే అన్న విషయం మరచి రేవంత్ మాట్లాడటం గురివింద సామెతను గుర్తు చేస్తున్నదని ఎద్దేవా చేశారు. నాడు చంద్రబాబుకు ఊడిగం చేసి, నేడు మోదీని బడేభాయ్ అని సంబోధించి ఊసరవెల్లే సిగ్గుపడేలా చేసిన చరిత్ర రేవంత్‌దని మండిపడ్డారు. 'నీటి విలువ తెలియదు.. నోటి విలువ తెలియదు. తెలిసిందల్లా అవినీతి నోట్ల విలువ మాత్రమే' అని విరుచుపడ్డారు. నోరుంది కదా అని అడ్డగోలుగా మాట్లాడకూడదని, ముఖ్యమంత్రిననే విషయాన్ని మరచిపోవద్దని హితవు పలికారు.

బీఆర్‌ఎస్ గెలిస్తే నారాయణపేట, కొడంగల్ నీటి కష్టాలు ఎప్పుడో తీరేవి...

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు అడ్డుపడుతూ కేసులు వేయించిన దుర్మార్గం రేవంత్‌రెడ్డిదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులు వేసిన కేసులను ఎదుర్కొని 90 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన 10 శాతం పనులు చేయకుండా కావాలని తొక్కిపెట్టి ప్రజల ఉసురు పోసుకుంటున్నది రేవంత్‌రెడ్డేనని విమర్శించారు. కాంగ్రెస్‌ను ఎన్నుకున్న పాపానికి పాలమూరు ప్రజలకు నీటి కటకట మొదలైందని అన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది కేసీఆరే

కాంగ్రెస్ పాలనలో వలసలకు, ఆకలిచావులకు నిలయంగా మారిన పాలమూరు తలరాతను మార్చింది కేసీఆరేనని హరీశ్‌రావు స్పష్టం చేశారు. పాలమూరులో బతుకులేక వలసెల్లిన లక్షలాది మందిని వాపస్ తెచ్చిన చరిత్ర కేసీఆర్‌దని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది కేసీఆర్ అని, కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, ఆర్డీఎస్ కింద కాంగ్రెస్ దరిద్రపుగొట్టు పాలనలో ఎన్నడూ 30వేల నుంచి 35 వేల ఎకరాలకు మించి సాగయ్యేది కాదని, అదే తమ హయాంలో తుమ్మిళ్ల ఎత్తిపోతలను పూర్తిచేసి రాజోలిబండ పూర్తి ఆయకట్టుకు నీరు అందించామని ఉదహరించారు. పదేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరులో దాదాపు 12 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు అందించిన ఘనత తమదని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పూర్తికాగానే మరో 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, బీఆర్‌ఎస్ చేసిన కృషితోనే రాష్ట్రంలో అత్యధికంగా సాగునీటి వసతి కలిగిన సస్యశ్యామల జిల్లాగా పాలమూరు మారిందని వివరించారు.

ఖమ్మం జిల్లా వేంసూరులో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధర్నా చేస్తున్న రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రైతుల ధర్నా

- పంట పొలాలకు దారి చూపాలని డిమాండ్

వేంసూరు, ఫిబ్రవరి 21 : పంట పొలాల్లోకి వెళ్లేందుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల ఇబ్బంది పడుతున్నామని, తమకు దారి చూపాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా వేంసూరు మండలం ఎర్రగుంటపాడు, వేంసూరు గ్రామాలకు చెందిన రైతులు శుక్రవారం వేంసూరులో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన ఉన్న తమ పంట పొలాల్లోకి వెళ్లేందుకు దారి ఇవ్వకుండా కంచె వేయడంతో కిలోమీటర్ల కొద్దీ తిరిగి తమ పొలాలకు రావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేశారు. మామిడి తోటల్లోకి కూడా కనీసం వాహనాలు వెళ్లడం లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కనున్న పొలాల్లోకి వెళ్లేందుకు దారి చూపాలని వారు కోరారు.

ఒకే ఇంటిపేరు ఉన్నదని సామాన్య రైతు నిర్బంధం!

- గొంతు సర్జరీ జరిగిందని చెప్పినా వినకుండా అరెస్ట్
- సిరిసిల్లలో ఆగని కక్ష సాధింపులు
- సర్కారు తీరుపై విమర్శల వెల్లువ



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లాలో సర్కారు పెద్దల కక్షసాధింపు చర్యలకు అమాయక రైతులు బలవుతున్నారు. అసైన్డ్ ల్యాండ్ సాకు చూపుతూ ఇప్పటివరకు నేతలపై విరుచుపడ్డ యంత్రాంగం.. ఇప్పుడు సాధారణ ప్రజల్నీ వదలడం లేదు. నిన్నటివరకు బీఆర్‌ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు తాజాగా ఓసామాన్య రైతును రిమాండ్‌కు తరలించడం కలకలం రేపింది. గొంతు ఇన్ఫెక్షన్‌తో మూడు రోజుల క్రితం ఆపరేషన్ చేయించుకొని మాట్లాడలేని స్థితిలో ఉన్న రైతుపై ప్రభుత్వం అమానవీయంగా వ్యవహరించడం విమర్శల పాలవుతున్నది. ఒకే ఇంటిపేరు ఉండటంతో బీఆర్‌ఎస్ నాయకుడికి బదులు రైతుపై ప్రతాపం చూపించారంటూ బాధిత కుటుంబం చెప్తున్నది. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డి (52) తన తాతల నుంచి సంక్రమించిన 30గుంటల భూమిని యాభై ఏళ్లుగా కుటుంబ సభ్యులు సాగు చేసుకుంటూ వస్తున్నారు. 2018లో సాదాబైనామాతో గుర్తించి పీఓటీ చట్టం ద్వారా రాజిరెడ్డి తన పేరుమీదకు మార్చుకోగా, రెవెన్యూ అధికారులు పట్టాపాసుబుక్కు కూడా ఇచ్చారు. సాగు చేసుకుంటున్న భూమిని కబ్జా చేశాడంటూ ఎవరో ఇచ్చిన ఫిర్యాదుపై ఎలాంటి ప్రాథమిక విచారణ జరుపకుండానే రైతు రాజిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారని రాజిరెడ్డి భార్య లత, అన్న కూతురు లావణ్య ఆవేదన వ్యక్తంచేశారు. గొంతు సర్జరీ అయ్యిందని చెప్పినా, బలవంతంగా మోటర్ సైకిల్‌పై తీసుకుపోయారని వారు కన్నీటిపర్యంతమయ్యారు. 'మా తాతల కాలం నాటి భూమిని మా బాబాయ్ సాగుచేస్తున్నడు. అబ్బాడి అని ఇంటి పేరున్నందుకే పోలీసులు ఆయనను అరెస్టు చేసిండ్రు' అని లావణ్య తెలిపారు. తహసీల్దార్ ఫిర్యాదు మేరకు రైతు రాజిరెడ్డిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రామ్మోహన్ చెప్తున్నారు. అరెస్ట్ విషయం తెలియగానే బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, నాయకులు తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే కేసులతో వేధిస్తున్నదని బీఆర్‌ఎస్ తంగళ్లపల్లి మండల శాఖ అధ్యక్షుడు గజబింకార్ రాజన్న మండిపడ్డారు.